



రైల్వే స్టేషన్ ముందు నిరసన చేపడుతున్న నాయకులు



స్మార్ట్ షాక్..!

- ఇప్పటికే 63వేల మీటర్లు బిగింపు
- కొత్త మీటర్లతో పెరుగుతున్న విద్యుత్ బిల్లులు
- వినియోగదారులు బెంబేలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ దోపిడీ మొదలైంది. విడతల వారీగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. దీంతో పలువురికి గతంలో కంటే ఎక్కువ బిల్లులు వస్తున్నాయి. బిల్లులను చూసి వినియోగదారులు షాక్ అవుతున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్ పెయిడ్ విధానంలో బిల్లులు వసూలు చేస్తుండగా భవిష్యత్తులో ప్రీ పెయిడ్ విధానాన్ని తీసుకురానున్నారు. సెల్‌ఫోన్ మాదిరి రీఛార్జ్ చేయకుంటే ఇంటికి విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. స్మార్ట్ మీటర్లు తమ పాలిట శాపంగా మారుబోతున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును ఆదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది. విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయగా రెండో విడతలో వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటి వరకూ 63 వేల స్మార్ట్ మీటర్లను బిగించారు. ఆ తరువాత మూడో విడతగా గృహలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్‌పెయిడ్ విధానంలోనే బిల్లులు వసూలు చేస్తున్నారు. కర్నూలు 45వ వార్డులో అజీముద్దీన్‌నగర్ నివాసంలో ఉంటున్న వెల్డింగ్‌షాపు యజమాని జెఎండి ఉస్మాన్‌బాషకు పాతమీటర్లు ఉన్నప్పుడు నెలకు రూ.3380 వచ్చేది. స్మార్ట్ మీటరు బిగించాక మొదటి బిల్లు రూ.30,758 వచ్చింది. 256 బిల్డ్ యూనిట్స్‌కు అన్ని కలిపి రూ.3380 వచ్చింది. కెపాసిటర్ వాడినందుకు వచ్చిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇంతబిల్లు ఎలా కట్టాలి తగ్గించాలని వినయోగదారుడు ఉస్మాన్‌బాష అధికారులను కోరితే తగ్గించే అవకాశం లేదని, చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఇలా ఆయనతో పాటు పలువురికి స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటరకు ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుంది. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి.

విపరీతమైన బిల్లులు వచ్చే ప్రమాదం

ఉమ్మడి జిల్లాల్లో 67 వేల స్మార్ట్ మీటర్లు బిగించాల్సి ఉండగా 63000 పూర్తి అయ్యాయి. 2019-20లోనే స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయి. మోటర్లు, వాటర్ ప్లాంట్లు, వెల్డింగ్ షాపుల యజమానులు ఖచ్చితంగా కెపాసిటర్లు బిగించుకోవాలి. కెపాసిటర్లను వాడితే ఎంత ప్రయోజనమో, అంతే ప్రమాదం కూడా ఉంది. కెపాసిటర్లు పెట్టుకున్న వారు మోటర్లు ఆన్ చేసినప్పుడు ఆన్ అయ్యేటట్లు మోటారు ఆఫ్ చేస్తే ఆఫ్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకొని ఉంచాలి. లేనిపక్షంలో విపరీతమైన బిల్లులు వచ్చే ప్రమాదం ఉంది. 200 యూనిట్లపైగా కాల్చే వారందరికీ స్మార్ట్ మీటర్లు పెట్టాలని ఉంది. అంచలంచలుగా ప్రజల్లో అవగాహన కల్పించి స్మార్ట్ మీటర్లను పెంచాలని ప్రభుత్వము ఆలోచన.

– ఈ.విజయభాస్కర్, విద్యుత్ శాఖ డిఈ.

మీటర్ రీడర్లపై దెబ్బ

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల మీటర్ రీడర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడనుంది. స్మార్ట్ మీటర్ల వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 527 మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోనున్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోండి



రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడం చాలా దుర్మార్గం. కర్నూలు జిల్లాలో కర్నూల్ నగరంలోని అజుముద్దీన్ నగర్ లో ఉస్మాన్ అనే వినియోగదానికి వచ్చిన బిల్లు చూస్తుంటే ప్రజలు రాబోయే కాలంలో కరెంటు వదిలేసి మళ్లీ బుడ్డి దీపాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. మూడు వేలు రావలసిన బిల్లు 30వేలు వచ్చిందంటే సామాన్య ప్రజలు ఎలా కట్టుకోవాలో చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలి. గతంలో బాదుడే బాదుడు అని చెప్పిన ఈ ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు తెచ్చి ప్రజలపైన భారం వేస్తున్నాడు. ప్రజలు కూడా దీన్ని గమనించాలి. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలు దాటిన తర్వాత ప్రజలపై భారాలు మోసే మాట మాట్లాడమంటేనే ఇలాంటి రాజకీయ నాయకులను రీకాల్ చేసే పద్ధతి రావాలి. ప్రజలు మేలుకోకపోతే తర్వాత బాధపడతారు. అందుకోసం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి. స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోండి. బడా కంపెనీలు ఊడిగా చేయడం కోసమే ఈ ప్రభుత్వాలు ఉన్నాయి. సామాన్య ప్రజలకు వినియోగదారులకు మేలు చేసే ఒక్క కార్యక్రమం కూడా టిడిపి కూటమి ప్రభుత్వం చేయడం లేదు.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించాలి

-కర్నూల్ నుండి ఇతర ప్రాంతాలకు కొత్త లైన్లు, రైళ్లు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా సాధారణ బడ్జెట్‌తో పాటు రైల్వే బడ్జెట్ లో కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, కొత్త రైళ్ల ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు రైల్వే స్టేషన్ ముందు కర్నూలు జిల్లాకు నిధులు కేటాయించాలని కోరుతూ నిరసన చేపట్టారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసనను ఉద్దేశించి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పాలకులు మారుతున్నారు తప్ప కర్నూలు జిల్లా భవిష్యత్తు మారడం లేదన్నారు. కర్నూలు జిల్లా నుండి రాజధానికి వెళ్లాలంటే కనీసం ఒక ట్రైన్ కూడా లేకపోవడం కర్నూలు నగర ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. ఈ జిల్లా నుండి ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు అయ్యారని, ఏ ఒక్కరు కూడా జిల్లా నుండి ప్రధానమైన నగరాలను కలుపుతూ ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం కోసం నామమాత్రపు కృషి కూడా చేయలేదని ఘాటుగా విమర్శించారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తామన్న నాటి ప్రభుత్వ వాగ్దానాలు నేటికీ నెరవేరలేదని, పదేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉందన్నారు. దానికోసం నిధులు కేటాయించడంలో బిజెపి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కర్నూలు నుండి హైదరాబాద్ కు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలని కోరుతూ సిపిఎం , ఇతర పార్టీలు పెద్ద ఎత్తున సంవత్సరాల తరబడి పోరాటం చేయడం ఫలితంగా 2018 లో ఇంటర్సిటీ వచ్చిందన్నారు. రాష్ట్రం విడిపోవడంతో మళ్లీ కర్నూలు నగర ప్రజలకు రాజధానికి వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు తప్ప వేరే మార్గం లేని పరిస్థితి ఉందన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు దీని గురించి కనీసం ఆలోచన కూడా చేసే ఓపిక వాళ్లకు లేదన్నారు. ఇలాంటి వాళ్లను గెలిపించడాన్నీ ప్రజలు ఆలోచించాలని కోరారు. కర్నూల్ నుండి ఓర్వకల్లు మీదగా నంద్యాలకు కొత్త రైల్వే లైన్ ఇస్తానన్న ప్రభుత్వ వాగ్దానం అమలుకు చేయాలన్నారు. కర్నూల్ నుండి విజయవాడకు ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలని, కాచిగూడ నుండి గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ వరకు పొడిగించాలన్నారు. విశాఖపట్నం, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌రైళ్లను తిరిగి ప్రారంభించాలన్నారు. కర్నూలు నుంచి ఓర్వకల్లు మీదుగా నంద్యాల రైల్వే లైన్ పనులు త్వరగా ప్రారంభించాలని, మంత్రాలయం నుండి శ్రీశైలంకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలన్నారు. కర్నూల్ నుండి ముంబయికు వెళ్లడానికి కొత్త ట్రైన్ వేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, అంజిబాబు మాట్లాడారు. సిపిఎం నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, నర్సింహులు, విజయ్, రామకృష్ణ, షరీఫ్, అబ్దుల్లా, రాఘవేంద్ర, నగేష్, రత్నమ్మ ప్రభాకర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

- మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్య కుమారి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బాల్య వివాహాలు అరికట్టడానికి సమన్వయంతో పని చేయాలని మహిళా, శిశుసంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.సూర్య కుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలికలను ఇబ్బంది పెడితే పోక్సో కేసు నమోదై, అబ్బాయిల జీవితాలు నాశనం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని, వారికి కావాల్సిన నైపుణ్యాలను నేర్పించాలన్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ దూరంగా ఉన్న గ్రామాల్లో పిల్లల్ని పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్, బిసిలలో ఎవరికైతే ఎక్కువ సబ్సిడీ వస్తుందో, వారికి ఓమ్ని వాహనాలు ఇప్పించాలని సూచించారు. స్కూల్స్, వసతి గృహాల్లో 20 మందితో కలిపి అబ్బాయి, అమ్మాయిలకు వేర్వేరుగా గ్రూప్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పోలీస్ అధికారులు బాల్యవివాహాల నిర్మూలనపై శ్రద్ధగా పని చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పేదరికం, వలసలు, మూఢనమ్మకాలు, అభద్రత భావం, తక్కువ అక్షరాస్యత వంటి కారణాలతో బాల్య వివాహాలు జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. 64 బాల్య వివాహాలను ఆపామన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, మంత్రాలయం, సి.బెళగల్ మండలాలను హై రిస్క్ మండలాలుగా గుర్తించామన్నారు. ఈ మండలాలలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. 17, 18, 19 ఏళ్ల వయసు ఉన్న వారిలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగాయని, ఇందులో బడి మధ్యలో మానేసిన వారు కూడా ఉన్నారన్నారు. మహిళా అభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో ప్రధాన అంశం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ అని, ఈ దిశగా అన్ని శాఖల అధికారులు బాల్యవివాహాలను రూపుమాపేలా కృషి చేయాలని డైరెక్టర్ తెలిపారు. అనంతరం కిషోరి బాలిక స్వేచ్ఛకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి రోహిణి, యూనిసెఫ్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఐసిడిఎస్ పిడి నిర్మల, జిల్లాపరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న అధికారులు

ఈ సారైనా ఇచ్చేరా..?

- ప్రతి సారీ జిల్లాకు మొండిచేయి
- నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రతి కేంద్ర బడ్జెట్‌లోనూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు, రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించడం లేదు. కేంద్ర బడ్జెట్‌ను శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఈసారైనా నిధులు ఇస్తారని జిల్లా ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు...

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. గత ప్రాజెక్టుల్లో జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల కేటాయింపుల అతీ గతి లేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించడం లేదు. గతంలో కేంద్ర విద్యాసంస్థలకు నిధుల ప్రస్తావన లేదు. శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఈసారైనా నిధులు ఇస్తారని జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రైల్వేపై చిన్నచూపు..

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో చిన్నచూపు చూస్తోంది. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించడం లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు.



కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం, కర్నూలు-శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. అయితే గత బడ్జెట్లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది.

కోచ్ ఫ్యాక్టరీకి శూన్యం..

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని ఆలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు.



వీధి బాలల నివారణకు ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

వీధి బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు వీధి బాలల నివారణకు ఆకస్మిక తనిఖీలను కర్నూలులో నిర్వహించారు .జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కర్నూలు అర్బన్ తహసీల్దార్ ఇ వెంకట లక్ష్మి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఎం. శివరామచంద్ర రావు, మహిళ పోలీస్ ఎస్ ఐ. రమణా రావు, సిడబ్లుసి మెంబర్ వెంకట రాముడులు పాల్గొన్నారు. వీధి బాలలు కనిపిస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు తెలియజేయాలని వారు కోరారు.

క్లస్టర్ యూనివర్సిటీ కాన్వకేషన్ వాయిదా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఫిబ్రవరి 8న జరగవలసిన క్లస్టర్ యూనివర్సిటీ కాన్వకేషన్ వాయిదా పడినట్లు గవర్నర్ ఆఫీస్ నుండి ఆదేశాలు అందాయని వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలోతెలిపారు. కాన్వకేషన్ ఎప్పుడు నిర్వహించేది గవర్నర్ నుండి ఆదేశాలు వచ్చిన తర్వాత తెలియజేస్తామన్నారు. కాన్వకేషన్ కి అప్లై చేసిన యుజి, పి జి విద్యార్థులకు తదుపరి కాన్వకేషన్ నిర్వహించే తేదీ ఈ మెయిల్, ఫోన్‌ల ద్వారా ముందుగా నే తెలుపుతామన్నారు.

5న వైసిపి ' ఫీజు 'పోరు

వాల్‌పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఈనెల 5న వైసిపి ఫీజు పోరు పై ఆందోళన చేస్తున్నామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు లోని తన నివాసంలో కార్పొరేటర్లు అనుబంధ సంఘాల అధ్యక్షులు విద్యార్థి సంఘం నాయకుల తో కలిసి ఫీజు పోరు గోడ పత్రికను నంద్యాల జిల్లా అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆవిష్కరించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ చంద్రబాబు సర్కార్ పై నిరసనగా ఈనెల 5న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నంద్యాలోని ఉదయానంద హోటల్ దగ్గర నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి నంద్యాల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి విద్యార్థి, విద్యార్థి తల్లిదండ్రులు వైసిపి నాయకులు అందరు పాల్గొని న్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి విభాగం నాయకులు, వైసిపి అనుబంధం విభాగాల జిల్లా, మండల అధ్యక్షులు, వైసిపి కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించేలా చర్యలు

మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్య కుమారి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని స్త్రీ, శిశు అభివృద్ధి వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖల కార్యదర్శి ఎ.సూర్య కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సునయన ఆడిటోరియంలో వివిధ ఐసిడిఎస్ అంశాల అమలు పై మహిళా అభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణు గోపాల్ రెడ్డి తో కలిసి ఆమె ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్వైజర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్‌లోని పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పోషకాహారాలు అందిస్తున్నారన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు రక్తహీనత, బరువు తక్కువ వంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. అంగన్వాడి సెంటర్లలో ఉన్న టీచర్లు, హెల్పర్లు నిబద్ధతతో పనిచేసి గర్భిణీస్త్రీలకు, చిన్నపిల్లలకు పోషకాహారము సక్రమంగా అందజేయలన్నారు.. అనంతరం డైరెక్టర్ మండలాల వారీగా అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న తాగునీరు, టాయిలెట్స్, కరెంటు మొదలగు విషయాలపై పిల్లల ఎత్తు, బరువు, రక్తహీనత, గర్భిణీ స్త్రీల రక్తహీనత పోషకాహార సరఫరా , పిల్లల ఆరోగ్య పరిస్థితుల అంశాలపై సమీక్ష నిర్వహించి వారు వెనుకబడిన విషయాలలో తగు సూచనలు ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి నవ్య ఐసిడిఎస్ పిడి నిర్మల, సిడిపిఓలు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ.సూర్య కుమారి

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు రెండేళ్లు వాయిదా వెయ్యాలి

- బిల్డర్స్ అసోసియేషన్

-కొనేవారు లేక నిలిచిపోయిన వెయ్యి భవనాలు వందల ఇళ్లకు టులెట్ బోర్డులు

-వివిధ సంఘాల నాయకుల వినతి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణరంగం సంక్షోభంలో పడి వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో బిల్డర్స్ ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ పెంచడం భావ్యం కాదని, కనీసం రెండేళ్లయినా వాయిదా వేయాలని బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ బ్రిజేష్ సింగ్ జిల్లా రిజిస్ట్రర్ చెన్నకేశవరెడ్డిని కోరారు. శుక్రవారం బిల్డర్స్ అసోసియేషన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం జిల్లా రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణరంగం సంక్షోభంలో ఉన్నందున బిల్డర్స్‌తో పాటు వేలాది మంది వర్కర్స్ కూడా ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైస్‌మిల్లు యజమానుల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.వి బ్రహ్మయ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కె.మధుసూదన్, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా దాదాపు వేయి వరకు భవనాలు కొనేవారు లేక నిలిచిపోయాయన్నారు. కర్నూలు నగరంలో ఎన్నడూ లేని విధంగా వందలాది ఇళ్లకు టూలెట్ బోర్డులు కనిపిస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం అద్దె విలువ నుండి ఆస్తి విలువపై ఇంటి పన్నులు విధించే చట్టం తెచ్చింది. దీనివల్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగినప్పుడల్లా ఇంటి పన్నులు కూడా పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్లు పెరగడం వల్ల కార్పొరేట్ సంస్థలు ఆస్తి విలువను చూపించి వందల వేల కోట్లు బ్యాంకుల నుండి అప్పు తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుందని విమర్శించారు. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ బృందంలో బిల్డర్స్ గోరంట్ల రమణ, చంద్రమౌళి, పిపిఎస్ఎస్ నాయకులు సివి.వర్మ ఏ వెంకటేశ్వర్లు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

బిటిఆర్ నగర్ సమస్యలు పరిష్కరించాలి

అదనపు కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్: కర్నూలు నగరంలోని 19, 20 వార్డుల పరిధిలోని బిటిఆర్ నగర్ లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరుతూ సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి. కృష్ణకు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, వార్డు శాఖ కార్యదర్శి బి. రాధాకృష్ణ , బి టి ఆర్ నగర్ లో డ్రైనేజీ కాలువలు, రోడ్ల సమస్యను వివరిస్తూ బిటిఆర్ నగర్ ఏర్పడి 30 సంవత్సరాలు కావస్తున్నా కాలనీలో డ్రైనేజీ కాలువలు నిర్మించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. డ్రైనేజీ కాలువలు నిర్మించి ప్రజలను అనారోగ్యాల బారిన పడకుండా కాపాడాలని అన్నారు. రోడ్లు వేయాలని గతంలో అర్జీ ఇచ్చిన సందర్భంగా 2021లో మెటల్ రోడ్డు వేశారు. మెటల్ రోడ్డు వేసి సిమెంట్ రోడ్డు వేయడము మరిచారు. ప్రజలకు అసౌకర్యంగా ఉన్నటువంటి రోడ్డును వెంటనే సిమెంట్ రోడ్డు వేసి ప్రజలకు సౌకర్యంగా చేయాలని వారు కమిషనర్‌ను కోరారు. అదనపు కమిషనర్ స్పందించి మాట్లాడుతూ వీలైనంత త్వరలో డ్రైనేజీ కాలువలు, సిమెంట్ రోడ్డు వేయడానికి చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. వార్డు నాయకులు ఇఎల్ఎస్.రత్నమ్మ, ఎం.సుబ్బరాయుడు, ఎస్.మాలిక్, సతీష్ పాల్గొన్నారు.



అదనపు కమిషనర్‌కు వినతి ఇస్తున నాయకులు

రైల్వేప్రాజెక్టులను నిధులు రాబట్టండి

ఎంపికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నుండి నిర్వహిస్తున్న బడ్జెట్ సమావేశాలలో కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి మన కర్నూలు జిల్లాకు సంబందించిన రైల్వే ప్రాజెక్టులను సాధించాలని కోరుతున్నామని ఎంపి బస్తిపాటి నాగరాజకు పంపిన వినతిపత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. పంచలింగాల రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్ లో కేటాయించి, పనులు పూర్తి చేయించాలన్నారు. కర్నూలు నుండి విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, చెన్నై వంటి ముఖ్యమైన నగరాలకు నేరుగా రైళ్లు నడపాలి. గద్వాల - డోన్ మధ్య డబ్లింగ్ పనులు పూర్తి చేసేందుకు నిధులు రాబట్టాలి. మంత్రాలయం నుండి కర్నూలు రైల్వే లైన్ ఏర్పాటుకు అనుమతులు, నిధులు రాబట్టాలి. కర్నూలు నుండి నంద్యాలకు నేరుగా రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం సాధించాలి.2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో మన కర్నూలు జిల్లా రైల్వే ప్రాజెక్టుల సాధన కొరకు కృషి చేయాలని సిపిఎం తరుపున కోరుతున్నానని తెలిపారు.

ఎస్ఐ వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

పత్తికొండ అర్బన్ సిఐ జయన్న

ప్రజాశక్తి పత్తికొండ




ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రజలకు చేసిన సేవలు మరువ లేనివని పత్తికొండ అర్బన్ సిఐ జయన్న పేర్కొన్నారు పత్తికొండ పోలీస్ స్టేషన్ లో సాధారణ బదిలీల భాగంగా అనంతపురం జిల్లాకు వెళ్తున్న సందర్భంగా పత్తికొండ అర్బన్, రూరల్, సిఐ జయన్న, పులి శేఖర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కు శాలువా, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు.

జెల్లీ గిడ్డయ్య కుటుంబాన్ని పరామర్శించిన సంధ్యవిక్రమ్

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

నిత్యం కోడుమూరు నియోజవర్గ ప్రజలకు అండగా భరోసాగా జనసేన పార్టీ గురువారం కోడుమూరు నియోజవర్గం లో సుడిగాలి పర్యటన చేసిన సంధ్య విక్రమ్ కుమార్ ముందుగా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామ చేరుకొని గత వారం అప్పుల బాధతో మరణించిన రైతు జెల్లీ గిడ్డయ్య కుటుంబాన్ని పరామర్శించి భరోసాగా ఉంటామన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకొనిపోయి కుటుంబాన్ని అండగా నిలబడతావని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి కోడుమూరు పట్టణం చేరుకొని లివర్ వ్యాధి సమస్యతో బాధపడుతున్న వెంకట్రాముడును పరామర్శించారు. . అనంతరం కొండ పేటలోని జనసేన కార్యకర్త నాగేష్ తండ్రికి ఇటీవల ఆపరేషన్ చేశారని తెలిసి నాగేష్ నివాసానికి చేరుకుని వారి తండ్రి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రేయోభిలాషులు భారీగా హాజరయ్యారు.



బాధితులను పరామర్శిస్తున్న సంధ్య విక్రమ్


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

క్షేత్ర పరిశీలనలు, కూలీలతో సమావేశాలు

- ఉపాధిపై అధికారుల విస్తృత చర్యలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు గ్రామాలను వదిలి వలసలు వెళ్లకుండా నివారించేందుకు మండల యంత్రాంగం, ఉపాధి సిబ్బంది తగిన చర్యలను విస్తృతం చేసింది. ప్రధానంగా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఉదయం పూట ఎంపిడిఒ మణిమంజరి ఉపాధి సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అలాగే సాయంత్రం పూట గ్రామాల్లో ప్రజలు, కూలీలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం గంజిహళ్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల వద్దకు క్షేత్రస్థాయిలో హాజరై మస్టర్లను పరిశీలించారు. పనుల విషయంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం పెద్దమరివీడు గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. పనులకు అధిక సంఖ్యలో హాజరు కావడానికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మట్టి రోడ్ల పనులను, శ్మశానాల్లో కంప తొలగింపు పనులను కూడా చేపట్టేందుకు అనుమతించాలని ఎంపిడిఒను ఉపాధి కూలీలు కోరారు. కుటుంబంలో నలుగురు పనులకు వెళ్తున్నందున 100 పని దినాలు తొందరగా అయిపోతున్నాయని, అదనపు పని దినాలు కల్పించాలని మరికొంతమంది కోరారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... తగిన పనులు లేని గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వివిధ రకాల పనులను చేపట్టి ఉపాధి పనులను కొనసాగించుకోవచ్చని సూచించారు. ఎపిఒ మహ్మద్ బాష, ఈసి ఉస్మాన్ పాల్గొన్నారు.

రైతుల ధాన్యం మాత్రమే తీసుకుంటాం

- ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు సంబంధించిన ధాన్యం మాత్రమే మార్క్‌ఫెడ్ సంస్థలు కొనుగోలు చేస్తాయని ఎఒ జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల దగ్గర వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకోబోమని తెలిపారు. రైతు వ్యాపారి అయినప్పటికీ తన పొలంలో పండించిన ధాన్యం ఈకేవైసీ, రైతు సేవా కేంద్రంలో అమ్మటానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తన పొలం వరకే ధాన్యాన్ని తీసుకుంటామని తెలిపారు. కంది సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేస్తారన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

- ప్రజాశక్తి వార్తకు స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

'దోమలు బాబోయ్.. దోమలు' అనే శీర్షికన బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు మేజర్ పంచాయతీ సర్పంచి రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ స్పందించారు. శుక్రవారం సాయంత్రం హోళగుందలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. గత రెండు రోజుల క్రితం మార్లమడికి, ముందటి మాటికి గ్రామంలో కూడా అధికారులు ఫాగింగ్ చేపట్టారు. ఇలా దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వల్ల కొంతవరకు దోమలు వృద్ధి చెందడం నివారించవచ్చని, కొంతవరకు ఉపశమనం కలుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల


రంగస్వామి (ఫైల్)

మండలంలోని కులుమాల గ్రామంలో విద్యుత్ లైన్ పనుల నిమిత్తం కూలీకి వెళ్లిన గోనెగండ్ల గ్రామానికి చెందిన బోయ సొట్ట రంగస్వామి (45) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. గ్రామస్తులు, బంధువుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన రంగస్వామి విద్యుత్ లైన్ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. అతనికి భార్య రాజేశ్వరి, కుమారుడు మహేష్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. శుక్రవారం మండలంలోని కులుమాల గ్రామంలో జరుగుతున్న నూతన లైన్ల విద్యుదీకరణ పనులకు కూలిగా వెళ్లారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కిందికి దిగే సమయంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నూతన ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. కూలీలు అతన్ని చికిత్స నిమిత్తం గోనెగండ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలిస్తుండగా మార్గమధ్యంలో కోడుమూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు సిఐ గంగాధర్ తెలిపారు.

ఇప్పుడు బిల్లు ఎలా చేస్తారు..?

- ఎమ్మెల్యే నాణ్యత ఉందంటేనే కౌన్సిల్ ఆమోదం
- అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- ఎమ్మెల్యేపై వైసిపి కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై అనుమానాలు ఉన్నాయని చెప్పిన ఎమ్మెల్యే నేడు సమ్మతమే అని చెప్పడం ఏమిటని ఎమ్మెల్యేపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పట్టణంలో రూ.33 కోట్లతో చేపట్టిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ బిల్లు చేయాలని నాడు కౌన్సిల్ కోరితే నాణ్యత లేదని, కాంట్రాక్టర్ పారిపోతాడని ఎమ్మెల్యే పార్థసారథి చెప్పారని, మళ్లీ ఇప్పుడు ఎలా బిల్లు చేస్తారని, అంతా మీ ఇష్టమేనా అని వైస్ ఛైర్మన్ నరసింహులు, వైసిపి సీనియర్ కౌన్సిలర్ బాలాజీ ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. కాంప్లెక్స్ నిర్మాణంలో నాణ్యత ఉందని, అంతా సక్రమమేనని, బిల్లు చేస్తే కాంట్రాక్టర్ ఎక్కడికి పోడని బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి ఢిల్లీ నుంచి అయినా ఒక ప్రకటన చేస్తే చాలు తాము కౌన్సిల్ ఆమోదం చేస్తామని వైసిపి కౌన్సిలర్లు స్పష్టం చేశారు. వాడీవేడిగా వైసిపి కౌన్సిలర్లు వర్సెస్ వైసిపి రెబల్ కౌన్సిలర్ల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. పాత బస్టాండ్‌లో రూ.33 కోట్లతో చేపట్టిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, ఇప్పటికే అనేకసార్లు వాయిదా పడిందని, ఇప్పుడైనా కౌన్సిల్ ఆమోదం చేయాలని కమిషనర్ కృష్ణ కోరారు. దీనికి కౌన్సిల్ ఆమోదం అవసరం లేదని, కమిషనరే ప్రభుత్వానికి లేఖ రాస్తే సరిపోతుందని వైస్ ఛైర్మన్ నరసింహులు పేర్కొన్నారు. ఇప్పటికే రెండుసార్లు లేఖలు రాస్తే కౌన్సిల్ ఆమోదం కావాలన్నారని కమిషనర్ తెలిపారు. నాడు ఈ కాంప్లెక్స్ నిర్మాణంలో నాణ్యత లేదని, కాంట్రాక్టర్ పారిపోతాడని ఎమ్మెల్యే పార్థసారథి ఎలా చెప్పారని సీనియర్ కౌన్సిలర్ బాలాజీ ప్రశ్నించారు. మున్సిపాలిటీలో అధికారులు ఇష్టానుసారంగా చేస్తున్నారని, అసలు కౌన్సిల్‌కు సమాచారం, మర్యాద ఇవ్వడం లేదని వైస్ ఛైర్మన్ నరసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ ఆమోదం లేకపోతే కనీసం అధికారులు తిరిగే జీపులకు డీజిల్ కూడా ఉండదని, ఒక పేపర్ కూడా కొనలేరని గ్రహించాలని తెలిపారు. అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని, వారే అన్ని చేసుకుంటున్నారని, చివరకు కౌన్సిల్ ఆమోదం కోసం తీర్మానం పెడుతున్నారని, ఇలా ఉంటే తాము ఆమోదం చేయబోమని అన్నారు. 111 మంది కార్మికులను ఎవరి అనుమతితో ఎవరిని నియమించారో చూపించాలని డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లలో వైసిపి వారే మెజార్టీ ఉన్నారని, ఇతరులు ఇష్టానుసారంగా చేస్తామంటే ఒప్పుకునేది లేదని వైస్ ఛైర్మన్ నరసింహులు స్పష్టం చేశారు. మున్సిపల్ కాంప్లెక్స్ రీటెండర్ పిలిస్తే నిర్మాణ వ్యయం రూ.60 కోట్లు అవుతుందని, దీనివల్ల దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు నష్టపోతారని, కౌన్సిల్ ఆమోదం చేయాలని కమిషనర్ కోరారు. కాంప్లెక్స్ నిర్మాణ తీర్మానం మళ్లీ వాయిదా పడింది. మోటార్ల కొనుగోలుకు, అలాగే వాటి సామగ్రి కొనుగోలుకు నిధుల మంజూరుకు తీర్మానం ఆమోదించకపోతే తాగునీటి సమస్య ఎలా పరిష్కరించాలని మున్సిపాలిటీ డిఇ, ఎఇలు కోరడంతో సభ్యులు ఆమోదం తెలిపారు. ఆదోని పట్టణంలో జరిగే అభివృద్ధి పనులపై కమిటీలు వేయాలని, ఎక్కడ ఏ పని చేస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని, కేవలం లక్షలాది రూపాయలు మంజూరు చేసుకుంటున్నారు తప్ప పనులు ఎక్కడ చేస్తున్నారని కౌన్సిలర్లు ప్రశ్నించారు. పట్టణంలోని వార్డు సచివాలయాల్లో కంప్యూటర్లు చెడిపోయాయని, పనులు జరగడం లేదని, వాటికి మరమ్మతులు చేయించాలని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి కోరారు. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లు కొనాలని చెప్పినా ఎందుకు కొనడం లేదని కౌన్సిలర్ చలపతి ప్రశ్నించారు. తన వార్డులో తాగునీటి పైపులైన్ పనులు చేయాలని ఎన్నిసార్లు కోరినా ఎందుకు చేయడం లేదని ఫరిస్సా మొహల్లా కౌన్సిలర్ కోరారు. కౌన్సిల్ సమావేశంలో 36 తీర్మానాలు అజెండాలో పేర్కొనగా వాటిలో అనేక తీర్మానాలు మళ్లీ వాయిదా పడ్డాయి.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ ఛైర్మన్, వైసిపి కౌన్సిలర్లు

భజన పోటీల్లో అలంపూర్ మొదటి స్థానం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తంగరడోణ గ్రామంలో శ్రీచింతల ముని, నల్లారెడ్డి స్వాముల 35వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన అంతర్ రాష్ట్ర భజన పోటీల్లో తెలంగాణ రాష్ట్ర అలంపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఆలయ ధర్మకర్త పార్వతి, సర్పంచి శంకరమ్మ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. శుక్రవారం వారు మాట్లాడారు. ప్రతి ఏడాది శ్రీచింతల ముని, నల్లా రెడ్డి స్వాముల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భజన పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయని, గెలుపొందిన భజన బృందాలకు బహుమతులు ప్రదానం చేసినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ జట్టుకు మొదటి బహుమతి రూ.25 వేలు, 2వ బహుమతి ముకెళ్ల గ్రామానికి చెందిన మారుతి జట్టుకు రూ.20 వేలు, 3వ బహుమతి మండ్లవానిపల్లె గ్రామానికి చెందిన జట్టుకు రూ.15 వేలు, 4వ బహుమతి శంకరాపురం వెంకటేశ్వర భజన జట్టుకు రూ.11 వేలు, 5వ బహుమతి మడుగుపల్లె జట్టుకు రూ.10 వేలు, 6వ బహుమతి గోవిందిన్నె జట్టుకు రూ.9 వేలు, 7వ బహుమతి హాలిగేర జట్టుకు రూ.8 వేలు, 8వ బహుమతి తురవగల్లు జట్టుకు రూ.6 వేలు, 9వ బహుమతి గోపరాజు పల్లె జట్టుకు రూ.5 వేలు, 10వ బహుమతి దొడగొండ జట్టుకు రూ.3 వేలు అందజేశారు. గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు వెంకన్న, రంగన్న, హరినాథ్ రెడ్డి, నల్లారెడ్డి, సిద్ధయ్య స్వామి, లింగన్న, రాజన్న, దస్తగిరి, మునిస్వామి, వెంకటేష్, నల్లన్న, రంగముని, గోవిందు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి రంగమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపిపి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని తాగు నీరు, డ్రెయినేజీ, విద్యుత్, ఉపాధి తదితర 20 శాఖలకు సంబంధించిన సమస్యలపై అజెండాగా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు అధ్వానం..!

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ధణాపురం నుంచి హోళగుంద రోడ్డు నిర్మాణంపై స్పష్టత ఎక్కడ..?

ప్రజాశక్తి- హోళగుంద

ధణాపురం నుంచి హోళగుంద వరకు రోడ్డు నిర్మాణంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ముఖ్యమైన రోడ్ల రూపురేఖలు మాత్రం మారడం లేదు. ఈ రోడ్డు మండల ప్రజలకు జీవనాడి లాంటిది. అలాంటి రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయాణికులతో పాటు ఆర్‌టిసి అధికారులు, డ్రైవర్, కండక్టర్లు, ప్రయివేట్ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఆలూరు ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు జయరాం, అప్పటి ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మధ్య పర్సెంటేజీల రగడ జరిగి మొదలైన రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని విమర్శలు బహిరంగంగా వినిపించాయి. ధణాపురం నుంచి హోళగుంద రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాలు పోరాటాలు చేపట్టాయి. జనవరి 6న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెబ్బటం నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్ నిర్మాణ పనులు చేపట్టాలని పాదయాత్ర చేపట్టి వినతి పత్రం కూడా ఇచ్చారు. అయినా స్పందన లేకపోవడం బాధాకరం.

ఇబ్బంది పడుతున్నాం : ఆటో డ్రైవర్ లక్ష్మణ



ఈ రోడ్డుపై రోజూ ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. గత పదేళ్లుగా చిన్న ప్యాసింజర్ ఆటో కొనుక్కొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రోడ్డు బాగా లేకపోవడం వల్ల నడుము నొప్పుల సమస్య అధికమై ఆటో వల్ల వచ్చిన సొమ్మును డాక్టర్లకు పెట్టి నష్టపోయాను. ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితి కూడా బాగాలేదు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

ప్రజాప్రతినిధులు, అధికారులు స్పష్టత ఇవ్వాలి

- సిపిఎం జిల్లా నాయకులు కెపి.నారాయణ స్వామి



ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ధణాపురం, హోళగుంద వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు వెంటనే స్పష్టత ఇవ్వాలి. వారం రోజుల్లో అధికారుల నుంచి స్పష్టత రాకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం.


ధణాపురం నుంచి హోళగుంద రోడ్డు దుస్థితి (ఫైల్)



పాదయాత్ర చేపట్టిన ప్రజా సంఘాల నాయకులు (ఫైల్)

'సూపర్ సిక్స్'తో మభ్యపెట్టారు

- వైస్ ఛైర్మన్ నరసింహులు

ప్రజాశక్తి - ఆదోని

సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంట్లో ఉన్న మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని గద్దెనెక్కగానే సాధ్యం కష్టతారంగా ఉందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని తెలిపారు. అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినప్పటికీ చేసిన వాగ్దానాలు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే బడ్జెట్ చాలడం లేదని, చూస్తేనే భయమేస్తోందని పేర్కొనడం హాస్యాస్పదమని మండిపడ్డారు. మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు వాటి అమలు గురించి తెలియదా అంటూ ప్రశ్నించారు. 'డీఎస్సీ అదిగో ఇదిగో' అంటూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. స్టడీ సెంటర్లలో వేలాది రూపాయల ఖర్చుతో ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు అసహనానికి గురవుతున్నారని తెలిపారు. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ వంటి పథకాలు మాటలకే పరిమితమయ్యాయని, చంద్రబాబు పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని చెప్పారు. పవన్ కల్యాణ్ ప్రజలకు ఏం సమాధానం చెబుతారో వేచి చూస్తున్నారన్నారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధికి వైసిపి కౌన్సిలర్లు కట్టుబడి ఉన్నారన్నారు. కౌన్సిల్ సమావేశంలో రూ.1.58 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. గతనెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.4.50 కోట్ల అభివృద్ధి పనులకు తీర్మానం చేశామన్నారు. బిజెపి కౌన్సిలర్లు అని చెప్పుకునే వారు ఎమ్మెల్యేతో అభివృద్ధి నిధులు తెప్పించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ లలితమ్మ వార్డులో అజెండాలో మూడు వర్కులు పొందుపరచారని, అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి జరగాలని ఒక పనికి ఆమోదం తెలిపామన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని తెలిపారు. కౌన్సిలర్లు చలపతి, బాలాజీ, ఇంతియాజ్, ఇందు, లోకేశ్వరి, అశోక్, మాధవ్ రెడ్డి, నాగరాజ్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే

ముఖ్యమంత్రి బాబు లక్ష్యం

- డిజిటల్ విధానం ద్వారా ప్రజల చెంతకే సేవలు
- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


రాఘవేంద్రరెడ్డి

దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా కృషి చేస్తున్నారని, ఆయనను మించి ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ డిజిటల్ విధానం ద్వారా ప్రజల చెంతకే సేవలు అందించేందుకు చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే మొదటిసారి శుక్రవారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న విజనరీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని కొనియాడారు. 1995లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ-గవర్నెన్స్ విధానాన్ని అమలు చేశారని, 2025లో కూడా ముఖ్యమంత్రిగా ఉంటూ వాట్సాప్ గవర్నెన్స్ విధానం ప్రవేశ పెట్టడం చరిత్ర అని తెలిపారు. మొదటి దశలో 161 సేవలు 9552300009 నెంబర్ గల వాట్సాప్‌లో అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్టిఫికెట్ల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అవస్థలకు స్వస్తి చెప్పడానికి వాట్సాప్ గవర్నెన్స్‌ను తెచ్చిన ఘనత వారికే దక్కుతుందని చెప్పారు. దేవదాయ శాఖ నుంచి బుకింగ్, ఫిర్యాదు పరిష్కరణ, ఎపిఎస్ఆర్‌టిసి, ఎనర్జీ సేవలు, సిఎండి సేవలు రెవెన్యూ, ఆరోగ్య కార్డు, పోలీసు శాఖ, వివిధ సేవలు వాట్సాప్‌లోనే చేసుకోవచ్చని తెలిపారు. పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడం కూడా జరిగిందని, వాట్సాప్ ద్వారా సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 22న మెట కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. **దేవనకొండలో** ఐటిడిపి ఆలూరు తాలూకా అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తొలి విడతలో 161 సేవలు ఉన్నాయని, వాటిలో దేవదాయ, విద్యుత్, ఆర్‌టిసి, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సిఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల సేవలు ప్రజలు వినియోగించుకోవచ్చని తెలిపారు. రెండో విడతలో భాగంగా 360 సేవలు అందు బాటులోకి వస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కసర్టిఫికెట్‌పైన క్యూఆర్ కోడ్ వస్తుందని, ఎక్కడా నకిలీ తయారు చేయడానికి ఆస్కారం లేకుండా రూపొందించారని కొనియాడారు.


రామాంజనేయులు

దేవాలయంలో పూజలు

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక శ్రీమార్కండేయ స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన గోపుర, శిఖరం, కలశ ప్రతిష్టాపనలో భాగంగా ఆలయంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పద్మశాలి కులస్తుల ఆరాధ్య దైవం మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో ప్రధాన దేవత సహిత శిఖర దేవతలకు రుద్రాభిషేకం, మహస్త పనం, మహా సుదర్శన హోమం, లక్ష్మీ హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆరోపణలు నమ్మే పరిస్థితి లేదు

- జనసేన మండల నాయకులు పులి రాజు

ప్రజాశక్తి - ఆదోని

రాజకీయంగా ఎదుగుతున్న తనపై ఓర్వలేని కొందరు ఆరోపణలు చేసినా నమ్మే పరిస్థితిలో లేరని జనసేన మండల నాయకులు పులి రాజు పేర్కొన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదోని మండలం అలసంద గుత్తి గ్రామంలో బంధువులు పెంట దిబ్బలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఆ స్థలంలో మొలచిన ముళ్లకంపను తొలగించి చదును చేయించారని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలంలో బండలు పాతకున్నారన్నారు. ఓర్వలేని కొందరు స్థలం కబ్జా చేశారని పత్రికల్లో రాయించడం సమంజసం కాదన్నారు. సర్వే నెంబర్ 149లో 30 సెంట్ల స్థలం ఉన్నా అందులో తమకు 6 సెంట్ల స్థలం ఉందని తెలిపారు. పోరంబోకు భూములు ఆధీనంలో ఉన్నవారు పెంట దిబ్బలు, గడ్డివాముల కోసం ఉపయోగించడం సాధారణమే అని తెలిపారు. ఇది జీర్ణించుకోలేని కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేశారని.. సంబంధం లేని తన పేరును పత్రికల్లో పేర్కొనడం భావ్యం కాదన్నారు. జనసేనలో కీలకంగా వ్యవహరిస్తున్న తనను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. జనాధారణ ఉన్న జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్పపై కొందరు పని కట్టుకొని కబ్జాల మరక అంటించే ప్రయత్నం చేస్తున్నారని, వారి కుట్రలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాంటి వారిని వదలబోమని, పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న పులి రాజు

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని వధూ వరులను ఆశీర్వదించారు. శుక్రవారం గ్రామానికి చెందిన కీర్తిశేషులు మాదిగ రత్నం చిన్న కుమారుడు దేవదానం, శైలజ వివాహానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, నాయకులు అబ్రహాం, ప్రభుదాసు, ఆనంద్, కయ్యూన్, ఏబు, మారెప్ప, రాజు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఎస్ఐని కలిసిన లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శివాంజుల్‌ను జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నాయకులు బి.లక్ష్మన్న మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ శివాంజులును శాలువా, పూలమాలతో సన్మానించారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని డిటిఎఫ్ నాయకులు కోరారు. అఖిలభారత విద్యావంతుల వేదిక, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు మాట్లాడుతూ... ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న 84, 85, 117 జిఒలను రద్దు చేయాలని, అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం విద్యకు కేటాయించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి వెంటనే 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రము అందజేశారు. డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, రవీంద్ర, జిల్లా బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, వెంకటేశప్ప, జయానంద్, శివశంకర్, రాఘవేంద్ర, జగదీష్, సోమశేఖర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు